పండుగలా స్పీకర్ జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు, కార్యకర్తలు
- పట్టణంలో ర్యాలీ, గజమాలతో సత్కారం



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

వికారాబాద్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): శాసన సభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదిన వేడుకలు వికారాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సందడి నెలకొంది. దూర ప్రాంతాల నుంచి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. అర్ధరాత్రి టపాసులు కాల్చి కేకులు కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఉదయం క్యాంపు కార్యాలయానికి వేలాది మంది అభిమానులు చేరుకొని స్పీకర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. వికారాబాద్ పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి స్పీకర్‌ను గజమాలతో సత్కరించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న సనగారి కొండల్ రెడ్డి

ఇలా వచ్చి.. అలా వెళ్లారు

పరిగి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పరిగి మండలం నర్సయాగూడెం గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సును తూతూమంత్రంగా నిర్వహించారు. రెవెన్యూ అధికారులు మధ్యాహ్నం మూడు గంటలకు వచ్చి నాలుగు గంటలకే వెళ్లిపోయారు. సదస్సు నిర్వహించడానికి ముందు గ్రామంలో దరఖాస్తు ఫారాలు పంపిణీ చేయాల్సి ఉన్నా ఇవ్వలేదని గ్రామ రైతు సంఘం నాయకుడు రఘునందన్‌రెడ్డి ఆరోపించారు. దరఖాస్తుల జిరాక్స్ కోసం వేరే గ్రామానికి పంపేలోపు విప్పిన రికార్డుల మూటలు కట్టుకొని అధికారులు వెళ్లిపోవడంతో మండిపడ్డారు. దరఖాస్తులు స్వీకరించని అధికారులు ఎందుకు సదస్సు నిర్వహించారని గ్రామస్తులు ప్రశ్నించారు.



శంకర్‌పల్లిలోని సాయి కాలనీలో రేషన్ కోసం క్యూలైన్‌లో సంచులు పెట్టిన లబ్ధిదారులు

గిదేం వరుస!

మూడు నెలలకు ఆరు వేలి ముద్రలు

ప్రభుత్వం మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తుండడంతో రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. గంటల తరబడి క్యూలో ఉండలేక సంచులను లైన్‌లో పెడుతున్నారు. సన్నబియ్యం కోసం గంటల తరబడి వరుసలో నిలబడుతున్నారు. గతంలో ఇలా వెళ్లి అలా రేషన్ సరుకులు తెచ్చుకొనే వారు. ప్రస్తుతం మూడు నెలలకు ఆరు సార్లు థంబ్ వేయాల్సి వస్తుండడంతో విసుగు చెందుతున్నారు. దీంతో ఒక్కొక్కరికి తక్కువలో తక్కువ అరగంట సమయం పడుతోందని వాపోతున్నారు. దీనికి తోడు సర్వర్ సరిగా పనిచేయక మరింత ఆలస్యమవుతుండడంతో చేసేది లేక బియ్యం కోసం అక్కడే ఎదురుచూడాల్సిన పరిస్థితి వస్తోందని నిట్టూరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రేషన్ దుకాణాలను బుధవారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది.

- ఒకేసారి బియ్యం పంపిణీతో అవస్థలు
- రేషన్ షాపుల వద్ద లబ్ధిదారుల బారులు
- క్యూలో చెప్పులు, బస్తాలు, ఇతర వస్తువులు
- మొరాయిస్తున్న సర్వర్.. తెరుచుకోని షాపులు
- రోజు 20 మందికి మించి ఇవ్వలేని పరిస్థితి
- ఒక్కొక్కరికి దాదాపు అరగంట సమయం
- స్థలాభావంతో కోటా తెచ్చుకోని డీలర్లు

ఆంధ్రజ్యోతి విజిట్

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూన్ 4: ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలలకు సంబంధించి రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇస్తుండటంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత నెల వరకు రేషన్ కోసం లైన్‌లో 15 నిమిషాలు నిలబడితే సరిపోయేది. మూడు నెలలకు సంబంధించి బియ్యం ఒకేసారి ఇస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక్కోనెల కోటా బియ్యానికి ఒక్కోసారి తూకం వేయాల్సి వస్తోంది. ఒక్కో నెలకు సంబంధించి కేంద్రం ఇచ్చే బియ్యానికి(ఒక్కొక్కరికి 5 కిలోలు) ఒకసారి, రాష్ట్ర కోటా(ఒక్కొక్కరికి కిలో చొప్పున) బియ్యానికి మరోసారి వేలి ముద్ర వేయిస్తున్నారు. ఇలా మూడు నెలలకు కలిపి

మిగతా 7వ పేజీలో...



కీసరలో స్టాక్ లేక మూసి ఉన్న రేషన్ దుకాణం

200 షాపులకే బియ్యం

డీలర్లకూ తప్పని ఎదురుచూపులు

పాత స్టాక్‌నే పంపిణీ చేస్తున్న వైనం

నిల్వలు లేక దుకాణాలకు తాళం 7



అంగడి రైచూర్ రేషన్ షాప్ వద్ద రద్దీ

- రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం బుల్కాపురంలో బియ్యం పంపిణీ చేస్తున్న క్రమంలో స్టాక్ నుంచి నాలుగు క్వింటాళ్లు కట్ కాలేవని డీలర్ పేర్కొన్నాడు. యాచారం మండలం చౌదరిపలి, మొయినాబాద్ మండలం ఎనికేపల్లిలో సర్వర్ సమస్యతో రేషన్ షాపు మూసివేశారు. మంచాల మండల పరిధిలోని నోముల గ్రామంలో సర్వర్ సమస్య కారణంగా రేషన్ కోసం గంటల తరబడి లబ్ధిదారులు వేచి చూశారు.
- మేడ్చల్ జిల్లా కీసరలో బియ్యం స్టాక్ లేకపోవడంతో రేషన్ షాపును మూసివేశారు. నాగారంలో సర్వర్ సమస్యతో షాపు తెరవలేదు. దమ్మాయిపల్లి, అద్రాస్‌పల్లి, ఉప్పర్‌పల్లిలో బియ్యం కోసం లబ్ధిదారులు బారులు తీరారు.
- వికారాబాద్ జిల్లా పరిగి మండలం పరిగి, పూడూరు, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లోని రేషన్ షాపులకు బియ్యం కోట పూర్తి స్థాయిలో చేరుకోలేదు. 40 శాతం బియ్యం మాత్రమే గ్రామాలకు చేరాయి. ఇంకా 60 శాతం బియ్యం కోటా రావాల్సి ఉంది. కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొమ్రాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాల్లో ఇంకా పూర్తి స్థాయిలో బియ్యం రేషన్ షాపులకు చేరుకోలేదు. బియ్యం కోటా ఉన్న రేషన్ షాపుల్లో సర్వర్ సమస్య వెంటాడుతోంది. దీంతో సకాలంలో బియ్యం పంపిణీ చేయలేకపోతున్నారు. దౌల్తాబాద్ మండలం దేవర్ ఫసల్‌వాద్ మినహా మండలంలోని రేషన్ షాపులకు ఇంకా బియ్యం కోటా చేరుకోలేదు. చౌడాపూర్ మండల పరిధిలోని మంది పాల్ గ్రామం మినహా ఇతర రేషన్ షాపులకు బియ్యం కోటా సరఫరా కాలేదు. మోమిన్‌పేట మండలానికి ఇంకా స్టాక్ రాకపోవడంతో బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. జిల్లా వ్యాప్తంగా 16,518 మెట్రిక్ టన్నులకు ఇప్పటివరకు 4,835 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారు.

ఉమ్మడి జిల్లాలో రేషన్ పంపిణీ ఇలా..

జిల్లా	రేషన్ షాపులు	ఆహార భద్రత కార్డులు	ప్రతినెలా పంపిణీ (మెట్రిక్ టన్నుల్లో)
రంగారెడ్డి	936	5,78,500	14,500
మేడ్చల్	619	5,36,755	10,000
వికారాబాద్	588	2,51,097	5,506



బొంరాస్‌పేట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

భూ భారతితో శాశ్వత పరిష్కారం

- కలెక్టర్ ప్రతీక్‌జైన్

బొంరాస్‌పేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంతో భూ సమస్యలు శాశ్వతంతా పరిష్కారం అవుతాయని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలంలోని రేగడిమైలారం గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు హాజరై మాట్లాడారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 20వ తేదీ వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేసి రోజూ రెండు గ్రామాల్లో సదస్సులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూ రికార్డుల్లో నెలకొన్న అన్నిరకాల సమస్యలు, భూ సేకరణ కేసులు తదితర సమస్యలపై సదస్సుల్లో దరఖాస్తులు స్వీకరించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిర్దేశిత గడువులోపు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆగస్టు 14 వరకు భూ భారతి కింద వచ్చిన అన్నీ దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాగిరెడ్డిపల్లి గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. అలాగే బొంరాస్‌పేట్‌లో రేషన్ దుకాణాలను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఎస్‌వో మోహన్‌బాబు, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో వెంకన్న, అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకట రవణ



మాట్లాడుతున్న వెంకటరవణ

వికారాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మలేరియాను నిర్మూలించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవణ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మలేరియా మాసోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ర్యాలీలు, మీటింగులు, వాట్సాప్ మేసేజ్‌లు వీడియోల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. దోమలు నిలువ నీరు, మురుగునీటి కుంటల్లో గుడ్లు పెడుతాయని వాటి నివారనకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా ప్రోగ్రామ్ ఆఫీసర్ రవీంద్ర యాదవ్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యం, ల్యాబ్ టెక్నిషియన్లు సూపర్ వైజర్ సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

ప్రయాణికులకు త్రుటిలో తప్పిన ముప్పు

- గోరేపల్లిగేటు సమీపంలో ఘటన



గోరేపల్లి సమీపంలోని పొలంలోకి దూసుకుపోయిన బస్సు

యాలాల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. డ్రైవర్ చాకచక్యంతో ప్రయాణికులకు ముప్పు తప్పింది. ఈ ఘటన బుధవారం యాలాల మండలం గోరేపల్లి శివారులో జరిగింది. ప్రయాణికులు, ఆర్టీసీ డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు డిపో బస్సు(ఏపీ29 జెడ్1892) బుధవారం ఉదయం దేవనూరు నుంచి తాండూరువైపు వెళ్తోంది. అందులో మొత్తం 70 మంది ప్రయాణికులు ఉన్నారు. గోరేపల్లి గేటు సమీపంలోకి రాగానే స్టీరింగ్ పనిచేయలేదు. అప్రమత్తమైన డ్రైవర్ బాలప్ప కుడిచేతి వైపునకు మళ్లించి మెల్లమెల్లగా బ్రేకులు వేస్తూ పొలంలోకి దించాడు. అప్పటికే ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. చివరకు డ్రైవర్ బస్సును నిలిపాడు. ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సురక్షితంగా బస్సును నిలిపిన డ్రైవర్ బాలప్పను అభినందించిన ప్రయాణికులు కాలం చెల్లిన బస్సులను నడపడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

అర్ధరాత్రి గోవుల అక్రమ రవాణా 6

అడ్డుకోబోయిన యువకులపై దాడికి యత్నం

ప్రభుత్వ అధికారే సూత్రధారిగా అనుమానాలు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య 7

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

స్కూళ్లలో సౌకర్యాలపై అవగాహన

రైల్వేస్టేషన్, బస్టాండ్లలో తనిఖీలు



ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఘట్‌కేసర్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని రైల్వేస్టేషన్, బస్‌స్టాండ్‌లలో బుధవారం పోలీసులు, బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ తనిఖీలను నిర్వహించారు. బస్సుల్లో తనిఖీలు చేసి ప్రయాణికుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నెపల్లిలో బీజేపీ వర్క్‌షాప్

వికారాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నెల రోజుల కార్యాచరణ ప్రణాళికపై వర్క్‌షాప్ నిర్వహించారు. బుధవారం ఎన్నెపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేషనల్ ఎమర్జెన్సీ చీకటి రోజు, శ్యామ్‌ప్రసాద్ బలిదాన్ దివస్, పర్యావరణ దినోత్సవం, యోగా దినోత్సవం వంటి అంశాలపై చర్చించారు.

అంతా మా ఇష్టం

రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

- ఇబ్బందులు పడుతున్న కీసర ప్రజలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



కీసరలో ప్రధాన రోడ్డుపై ఇష్టానుసారంగా పార్కింగ్ చేసిన వాహనదారులు

కీసర, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ఇష్టానుసారంగా ప్రధాన రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని మేజర్ ప్రాంతం కీసర. వేలమంది కీసర నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి కీసర మీదుగా బొమ్మలరామారం వైపు పెద్ద ఎత్తున్న వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. కీసర ప్రధాన రోడ్లపై వాహనదారులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుంటడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కీసర ప్రధాన చౌరస్తాలో ఆటోలు, కీసర నుంచి ఈసీఐఎల్‌కు వెళ్లే దారిలో వాహనాలు రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్ర వేళ రద్దీ ఎక్కువగా ఉంటోంది.

కీసర రోడ్లను సగానికి పైగా ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వైన్స్‌లు ఉన్న దారుల్లో సాయంత్రం నుంచి రాత్రి 10.30 వరకు పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. దీంతో అటుగా వెళ్లే పాదచారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


పార్కింగ్ పైపైకి..

మాములు రోజుల్లో ఇలా ఉంటే శని, ఆది, పర్వదినాలు, శ్రావణ, కార్తీక మాసంలో కీసరగుట్టకు వచ్చే భక్తుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో ట్రాఫిక్ ముందుకు కదలని పరిస్థితి ఏర్పడుతుంది. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. వైన్స్‌లు, ఇతర షాపుల ముందు నిలిపే వాహనదారుల పట్ల చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.













అర్ధరాత్రి గోవుల అక్రమ రవాణా

అడ్డుకోబోయిన యువకులపై దాడికి యత్నం

ప్రభుత్వ అధికారే సూత్రధారిగా అనుమానాలు



డీఎస్పీకి ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు

పెద్దేముల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి వేళ గోవుల అక్రమరవాణాను అడ్డుకున్న యువకులపై దుండగులు దాడికి యత్నించారు. ఈ ఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం జనగాం గ్రామ శివారులో అటవీశాఖ అధికారికి ఫాంల్యాండ్ ఉంది. అక్కడి నుంచి గోవుల అక్రమరవాణా జరుగుతోందని బీజేపీ కార్యకర్తలకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. దీంతో కొంతమంది యువకులు అర్ధరాత్రి జనగాం గ్రామానికి చేరుకున్నారు. డీసీఎంలో గోవులు ఉండడం గమనించి వారు 100కు డయల్ చేశారు. విషయాన్ని తెలియజేసి గోవుల అక్రమరవాణాను అడ్డుకోవాలని ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చేవరకు డీసీఎంను వెళ్లనీయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే డీసీఎం ముందు, వెనక ఒక ఫార్చునర్‌కారు, బ్రీజాకారులో కొంతమంది రాడ్లు, కర్రలు పట్టుకుని ఉన్నారు. అడ్డుకోబోతే వారు దాడికి ప్రయత్నించారు. దీంతో కొంతమంది యువకులు పారిపోగా గొబ్బురు రాము అనే యువకుడికి కర్రలు, రాడ్లు చూయించి భయపెట్టి పక్కకు తోసివేశారు. అక్కడి నుంచి వారు డీసీఎంలో గోవులను తీసుకుని వెళ్లిపోయారు. ఈవిషయమై యువకులు పెద్దేముల్ పోలీస్‌స్టేషన్, తాండూరు డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అటవీశాఖకు చెందిన ప్రభుత్వ అధికారి ఫాంల్యాండ్ నుంచి గోవుల అక్రమరవాణా జరిగిందని, గోవుల అక్రమరవాణాకు ఆ అధికారి సూత్రధారి అయిఉంటాడని వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని వివరణ కోరగా యువకుల ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని చెప్పారు.



విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేస్తున్న టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఘట్‌కేసర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్కిల్-అప్‌స్కిల్-రీస్కిల్ అనే మూలసూత్రాన్ని అనుసరించాల్సిన అవసరం ఎంతో ఉందని తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సీఈవో శ్రీకాంత్ సిన్హా అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండపూర్‌లో గల సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్‌లో బుధవారం పాలిటెక్నిక్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఐటీలతో కలిసి నిర్వహిస్తున్న ఏఐ సమ్మర్ ఇంటర్న్‌షిప్ అవకాశాలపై దృష్టి సారించాలన్నారు. డ్రగ్ ఫ్రీ క్యాంపస్, డ్రగ్ ఫ్రీ రాష్ట్రం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా 450మంది గ్రాడ్యుయేట్లకు డిగ్రీ పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేల్పూరి చక్రవర్తి, సంస్థ చైర్మన్ ఏపీ రమణారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె కేశవరెడ్డి పాల్గొన్నారు.

పట్టణ పారిశుధ్యానికి సహకరించాలి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలో చేపడుతున్న పారిశుధ్యానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ సునీత కోరారు. మున్సిపాలిటీలో చేపట్టిన వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం కాలనీలలో పర్యటిస్తూ తడి, పొడిచెత్త వేరు చేయటంపై అవగాహన కల్పించారు. ప్రతీ వార్డు నుంచి చెత్తను సేకరించడానికి వాహనాలను నడిపిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్తబండిలోనే వేయాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.












మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

పదవీ విరమణ వయస్సు పెంచాలనుకోవడం సరికాదు

» ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

కొడంగల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ వయస్సును 61 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని ప్రభుత్వం ఆలోచించడం సరైంది కాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. బుధవారం సిద్దిపేటలో జరిగిన రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పదవీ విరమణ వయస్సు పెంచడంతో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఎంతో మంది నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇలాంటి ఆలోచనను విరమించుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను సత్వరమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ షఫీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న జిల్లా వైద్యాధికారి వెంకటరవణ

వైద్యులు దైవంతో సమానం

ధారూరు, జూన్4(ఆంధ్రజ్యోతి): ప్రజల దృష్టిలో వైద్యులు దైవంతో సమానమని జిల్లా వైద్యధికారి వెంకటరవణ తెలిపారు. మండలంలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన సూపర్‌వైజర్ లక్ష్మి అభినందన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సూపర్‌వైజర్ లక్ష్మి రోగులకు చేసిన సేవలకు అభినందనీయమని, ఆమె సేవలను ప్రజలు గుర్తుంచుకునేలా విధులు నిర్వర్తించారని తెలిపారు. అనంతరం లక్ష్మిదంపతులను ఆయన వైద్య సిబ్బందితో కలిసి శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి జయరాం, పీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ మేఘన, వైద్య సిబ్బంది ప్రీతమ్, ఉమ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చల్లా నర్సింహారెడ్డి

సమస్యల పరిష్కారానికే భూ భారతి

» టీయూఎఫ్ఐడీసీ స్టేట్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

మహేశ్వరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం ఉపయోగపడుతుందని టీయూఎఫ్ఐడీసీ స్టేట్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నతూప్ర గ్రామం, తుక్కుగూడ మున్సిపాలిటీలోని శ్రీనగర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ధరణి పోర్టల్ ద్వారా అనేక మంది పేదల భూములు అన్యాక్రాంతమయ్యాయని అన్నారు. భూ సమస్యల పరిష్కారమయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భూ భారతి చట్టం అమలుకు ఎంతో కృషి చేశారన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య, తహసీల్దార్ సైదులు, డీటీ నవత, ఆర్ఐ స్వర్ణలత, పావణితో పాటు రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్ రత్నం

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

» జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. విద్యార్థుల నమోదు ప్రచార జాత బుధవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకటరత్నం మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, వెంకట్రాములుగౌడ్, ముత్యప్ప, శివరాజ్, రత్నం, జమున, సుశీలమ్మ, గౌరారం గోపాల్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల భవనం పరిశీలన

బషీరాబాద్, జూన్ 04 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆదేశానుసారం బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి, సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ బుధవారం భవనాన్ని పరిశీలించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల(బాలుర)లో పాత భవనాన్ని పరిశీలించిన వారు ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. రెండేళ్ల కిందట గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బషీరాబాద్ మండలానికి జూనియర్ కళాశాల మంజూరైన అధ్యాపకుల నియమకం లేక ప్రారంభం కాలేదన్నారు. ప్రస్తుత తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఎనిమిది మంది కొత్త ఉపాధ్యాయులు నియామకమయ్యేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. వీరి వెంట కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మొద్దులకుంట పూడ్చివేతను ఆపండి

» ఆర్డీవో అనంతరెడ్డికి ఫిర్యాదు చేసిన రైతులు

యాచారం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్లగూడ గ్రామంలో ఉన్న మొద్దులకుంట పూడ్చివేతను తక్షణమే ఆపాలని కోరుతూ యాచారం మండల కేంద్రానికి చెందిన పలువురు రైతులు బుధవారం ఇబ్రహీంపట్నం అనంతరెడ్డికి ఫిర్యాదు చేశారు. కుంట పూడ్చివేత కారణంగా భూగర్భజలం తగ్గుతుందని, తద్వారా బోరుబావులు నిలువునా ఎండిపోయే ప్రమాదముందని కోరారు.

కూల్చివేతలకు బ్రేక్

» అధికారుల తీరుపై అనుమానాలు!



తాండూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని ప్రధాన రోడ్లపై ఆక్రమణల కూల్చివేతలకు బల్దియా అధికారులు సడన్‌గా బ్రేక్ ఇచ్చారు. ఈ నెల 3న 'ఆక్రమణల కూల్చివేతలపై రగడ' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై అధికారులు, రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. మంగళవారం తాండూరుకు వచ్చిన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) సుధీర్‌కుమార్ ఆక్రమణ కూల్చివేతలపై ఆరా తీశారు. ఇందుకు సంబంధించి నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో నోటీసుల జారీకి బల్దియా అధికారులు సిద్ధమైనట్లు సమాచారం. కూల్చివేతల అంశం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో తాత్కాలికంగా కూల్చివేతలు ఆపాలని ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జారీ చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రెండు రోజులుగా కూల్చివేతలు జరుగకపోవడం పలు విమర్శలను తావిస్తోంది. నాలుగు రోజుల క్రితం కూల్చివేతలు ప్రారంభించి వదిలేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇందిరాచౌక్ నుంచి రైల్వేస్టేషన్ మార్గంలో కూల్చివేతలు ప్రారంభించే క్రమంలో బ్రేక్ పడింది. అధికారులు నోటీసుల జారీ పేరుతో మరింత ఆలస్యం చేస్తున్నారని తెలుస్తోంది.

నాణ్యత పాటించకుంటే చర్యలు

ఆమనగల్లు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): హోటళ్ల నిర్వాహకులు నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని ఆమనగల్లు మున్సిపల్ కమీషనర్ శంకర్‌నాయక్ హెచ్చరించారు. ఆమనగల్లులోని హోటళ్లు, బేకరీలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లను బుధవారం తనిఖీ చేశారు. హోటళ్ల కిచెన్‌లు, పదార్థాలకు వినియోగించే ముడిసరుకులను, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. నాణ్యత పాటించని హోటళ్ల నిర్వాహకులకు జరిమానా విధించారు. లైసెన్స్‌లు లేని వారు, రెన్యూవల్ చేసుకోని వారికి నోటీసులిచ్చి చర్యలకు ఆదేశించారు. పరిశుభ్రత లేని, కల్తీ ఆహారాన్ని ప్రజలకు విక్రయించి వారి ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు. మునిసిపాలిటీలో తరచూ తనిఖీలు చేస్తామని


బేకరిలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్

చెప్పారు. ఆయనతో శానిటేషన్ సూపర్‌వైజర్ ఎల్లయ్య, ఇన్‌చార్జి మేనేజర్ సత్యనారాయణ, వార్డు అధికారులు సంతోష, గౌతమి, సురేందర్, సిబ్బంది రామకృష్ణ, సుభాష్, సికిందర్, సాయిరామ్ ఉన్నారు.

గిదేం వరుస!

(ఐదో పేజీ తరువాయి)

ఆరు సార్లు వేలిముద్రలు వేయాల్సి వస్తోంది. ఆయా కోటాల ప్రకారం ఆరుసార్లు తూకం వేస్తున్నారు. దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

డీలర్లకు తప్పని తిప్పలు

ఒకేసారి మూడు నెలల బియ్యం ఇస్తుండటంతో వేకువజామునే రేషన్ షాపుల వద్ద 40 మంది వరకు క్యూలో నిలబడితే 25 మంది పూర్తయ్యేసరికి సమయం గడిచిపోతోంది. సాయంత్రం మళ్లీ కొత్తగా మొదటి నుంచి లైన్‌లో ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గంటల తరబడి నిలబడలేక లబ్ధిదారులు క్యూలైన్‌లో చెప్పులు, బస్తాలు ఇతర వస్తువులు పెడుతున్నారు. మూడు నెలలకు సంబంధించి బియ్యం కోటా ఒకేసారి రావడంతో డీలర్లు ఎక్కడ స్టోరేజ్ చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. బియ్యం బస్తాలు స్టోరేజీ చేసుకునేందుకు స్థలం లేక కొంత మంది డీలర్లు సగం కోటనే తెచ్చున్నారు.


కొర్రేముల రేషన్ షాపు వద్ద బారులు తీరిన లబ్ధిదారులు

మధ్యాహ్నం వరకు వేచి చూశా..



నేను రోజు కూలి పనికి పోతాను. రెక్కాడితే గాని డొక్కడది. బియ్యం కోసం రేషన్ షాపుకు ఉదయం 6 గంటలకు వచ్చిన. అప్పటికే షాపు వద్ద లైన్ ఉంది. ఒక్కరికి బియ్యం ఇచ్చేందుకు అరగంట పడుతుంది. నేను బియ్యం తీసుకునే వరకు మధ్యాహ్నం దాటింది. కనీసం.. టీ కూడా తాగలేదు. బియ్యం కోసం ఒక రోజు కూలి పోయింది. వేలి ముద్రలు ఆరు సార్లు పెట్టాల్సి వస్తుంది. ఒకేసారి వేలి ముద్ర వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మహబూబ్, చేవెళ్ల


మైలారంలో ఖాళీగా రేషన్ షాపు

200 షాపులకే బియ్యం

డీలర్లకూ తప్పని ఎదురుచూపులు

వికారాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేయాల్సి రావడంతో ఇటు లబ్ధిదారులకు, అటు రేషన్ డీలర్లకు ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు 200 రేషన్ దుకాణాలకు మాత్రమే బియ్యం సరఫరా చేయగా, ఇంకా 300 దుకాణాలకు సరఫరా చేయాల్సి ఉంది. జిల్లాకు సరిపడా సన్నబియ్యం స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఇతర జిల్లాలపై ఆధారపడాల్సి వస్తోంది. జిల్లాలోని రేషన్ దుకాణాలకు వనపర్తి, నిజామాబాద్, పెద్దపలి జిల్లాల నుంచి సన్న బియ్యం సరఫరా చేస్తున్నారు. కాగా, రెండు, మూడు రోజుల్లో మిగిలిన రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేసేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

అప్‌డేట్ చేసినా ఆలస్యమే..

రేషన్ బియ్యం పంపిణీకి కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేసినా ఈ-పాస్ యంత్రాలు సర్వర్, నెట్‌వర్క్ సమస్యల కారణంగా బియ్యం పంపిణీలో జాప్యం చోటు చేసుకుంటోంది. లబ్ధిదారులు గంటల తరబడి బియ్యం కోసం నిరీక్షించాల్సి వస్తోంది. జిల్లాలో అన్ని రేషన్ దుకాణాల్లో మూడు నెలల బియ్యం పంపిణీ కొనసాగడం లేదు. గత నెలలో లబ్ధిదారులు తీసుకువెళ్లని బియ్యాన్ని తమ వద్ద స్టాక్ ఉన్నంత మేర డీలర్లు పంపిణీ చేస్తున్నారు. బియ్యం నిల్వలు లేని రేషన్ డీలర్లు పౌర సరఫరాల శాఖ అధికారులు పంపించే బియ్యం కోసం ఎదురుచూస్తున్నారు. బియ్యం అందుబాటులో లేని రేషన్ డీలర్లు తమ దుకాణాలను మూసివేసి బియ్యం కోసం ఎదురు చూస్తున్నారు.

ఘట్‌కేసర్‌లో ధాన్యం సేకరణ పూర్తి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మండలంలోని ఎదులాబాద్, మాధారం, ప్రతాప్‌సింగారం, అంకుశాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ముగిసినట్లు పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సుగుణబాయి తెలిపారు. జిల్లాలో 14 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరించారు. ఎదులాబాద్ సెంటర్‌లో 300 మంది రైతుల నుంచి 2,526.880 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, 191 మందికి రూ.3,49,40,864 చెల్లించారు. 109 మంది రైతులకు రూ.2,36,82,752 చెల్లించాల్సి ఉంది. మాధారం సెంటర్‌లో 131 మంది రైతుల నుంచి 1,171.96 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. 120 మందికి రూ.2,38,98,448 చెల్లించగా ఇంకా 11 మందికి రూ.32,61,408 చెల్లించాల్సి ఉంది. ప్రతాప్‌సింగారం సెంటర్‌లో 81 మంది రైతుల నుంచి 448.520 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, 38 మందికి రూ.53,56,408 చెల్లించారు. ఇంకా 43 మందికి రూ.50,01,632 చెల్లించాల్సి ఉంది. అంకుశాపూర్ కేంద్రంలో 49 మంది రైతుల నుంచి 562.160 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి 20 మంది రైతులకు రూ.60,58,200 చెల్లించారు. మరో 29 మందికి రూ.69,83,912 చెల్లించాల్సి ఉందని వివరించారు. డబ్బులు రాని వారికి త్వరలో ట్యాబ్ ఎంట్రీ చేయించి డబ్బులు ఖాతాల్లో జమచేయనున్నట్లు పేర్కొన్నారు. త్వరంలో జిల్లాలోని మిగతా కేంద్రాల్లోనూ ధాన్యం సేకరణ పూర్తవుతుందని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

» కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూన్ 4: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. విద్యా సంవత్సరం 2025-26 ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని శాఖల అధికారులు మండల స్థాయి అధికారులు వారితో పాటుగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడిబాట కార్యక్రమం ఈనెల 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించాలని సూచించారు. ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాఠశాలల్లోని సౌకర్యాల గురించి విస్తృత ప్రచారం పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనుల్లో ఎలాంటి సమస్యలు రాకుండా ప్రొగ్రెస్ ఉండాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించి ఆర్థిక సాయం పొందే విధంగా దరఖాస్తులు స్వీకరించి ప్రతిపాదన రూపొందించాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వం నుండి పెన్షన్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీఈఓ రేణుకదేవి, ఎంపీడీవో తహసీల్దార్, ఏపీఎంఎస్ మునిసిపల్ కమిషనర్లు, ప్రిన్సిపల్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

నందివనపర్తిలో పీహెచ్‌సీ ఏర్పాటుకు చర్యలు

యాచారం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని, ఇబ్బందులు రాకుండా వైద్యులు చొరవ చూపాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్‌రావు మండల వైద్యులను ఆదేశించారు. బుధవారం యాచారం ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం నందివనపర్తికి హెల్ సబ్‌సెంటర్‌ను పరిశీలించారు. ఇక్కడి భవనం కుంగిపోవడాన్ని అశ్చర్యపోయారు. భవనానికి తాము మరమ్మతులు చేయిస్తామని బీఎస్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి డీఎంహెచ్‌ఓకు వివరించారు. ఇదిలా ఉంటే యాచారంలో ఏరియా ఆస్పత్రి ఏర్పాటైన నేపథ్యంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నందివనపర్తికి తరలిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. సబ్ సెంటర్ వద్దే అదనంగా నాలుగు గదులు నిర్మిస్తే పీహెచ్‌సీ నిర్వహణకు అనువుగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను ప్రజలు వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. ప్రైవేట్‌కు ధీటుగా సేవలందించాలని కోరారు. ఆయన వెంట డాక్టర్ ప్రియాంక ఇతరు వైద్యులు ఉన్నారు.


నందివనపర్తి ఆరోగ్య కేంద్రం వద్ద పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

గ్రామకంఠం భూమిలో ఇంటి స్థలాలు చూపాలి

యాచారం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గ్రామకంఠం భూమిని గ్రామంలో ఇల్లు లేని పేదలకు కేటాయించి, ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని మంతన్‌గౌడ్, సుల్తాన్‌పూర్ గ్రామాల రైతులు రెవెన్యూ సదస్సులో ప్లకార్డులతో నిరసన తెలిపారు. బుధవారం మంతన్‌గౌడ్, నజ్దిక్‌సింగారం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామ కంఠం భూమిని తక్షణమే సర్వే చేసి పేదలకు ఇంటి స్థలాలకోసం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్ కారణంగా తమకు పట్టాపాస్‌బుక్‌లు రాలేదని రైతులు నిరసన తెలిపారు. రుణమాఫీ వర్తించని రైతులకు వెంటనే వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న భూతగాదాలను పరిష్కరించాలని రైతులు కోరారు. తాటిపర్తి, కుర్మిద్ద, నజ్దిక్‌సింగారం, నందివనపర్తి గ్రామాల మధ్య ఉన్న 1400 ఎకరాల భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇచ్చి హక్కులు కల్పించాలని నజ్దిక్‌సింగారంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు డిమాండ్ చేశారు. కాస్తు కాలంలో రైతుల పేరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమాలలో డిప్యూటీ తహసీల్దార్ కీర్తి సాగర్, ఆర్ఐలు మురళీకృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న రైతులు

ఊరూరా బడిబాట

కేశంపేట/చౌదరిగూడ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింహులు గౌడ్ తెలిపారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు బుధవారం కేశంపేట మండలంలోని సంతాపూర్, దత్తాయపల్లి, ఇప్పలపల్లిలో ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కేశంపేట, పరూఖ్‌నగర్ మండల ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, సత్యం, మండల ఉపాధ్యక్షుడు వినీత్‌గౌడ్, కార్యదర్శులు రాజు, అరుణ్ శ్రీశైలం, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప అన్నారు. ఉమ్మడి కొందుర్గు మండల పరిధిలోని అయోధ్యపూర్ తండా, రాంచంద్రపూర్, చౌదరిగూడ, ఇంద్రనగర్ తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు శేఖర్‌గౌడ్, రాములు, నర్సింహులు, విజయ్, సంజీవ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : సంతాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు


కొందుర్గులో మాట్లాడుతున్న వెంకటప్ప


శంషాబాద్‌లో చౌకధరల షాపును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

బియ్యం పంపిణీని సజావుగా చేపట్టాలి

రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

శంషాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బియ్యం పంపిణీని సజావుగా చేపట్టాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని చౌకధరల దుఖాణాలను బుధవారం సాయంత్రం పరిశీలించారు. జూన్, జూలై, ఆగస్టు మాసాలకుగాను ఒకేసారి బియ్యం పంపిణీ జరుగుతున్నందున ఆమె చౌకధరల దుఖాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీలర్లను, రేషన్ కార్డుదారులతో మాట్లాడి పంపిణీ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కాగా రెండు రోజుల పాటు సర్వర్ డౌన్ కారణంగా కొంత మేరకు ఇబ్బందులు ఎదురయ్యాయని గుర్తించారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల తరువాత టోకెన్లు జారీ చేయాలని సూచించారు. అదేవిధంగా బియ్యం నిల్వలు ఎప్పటికప్పుడు సరిపడేలా చూసుకోవాలని గోదాం ఇన్‌చార్జికి సూచించారు. మూడు నెలల బియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తియ్యేలా చూడాలని సిబ్బందని ఆదేశించారు. కార్డుదారులు కూడా సహకరించాలని ఆమె సూచించారు.


వికారాబాద్ పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ


వికారాబాద్: స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్


వికారాబాద్: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ గౌడ్


వికారాబాద్: కూతురు, కుమారుడితో స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఘనంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ జన్మదిన వేడుకలు

ధారూరు/యాలాల/చౌడాపూర్/తాండూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదిన వేడుకలను బుధవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ధారూరులోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అశోక్ ముదిరాజ్‌లు స్థానిక నాయకులతో కలిసి కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం టపాయకులు కాల్చి స్పీకర్ సంబురాలు జరుపుకున్నారు. వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు నాయకులు స్పీకర్‌ను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.రాములు, బుజ్జయ్యగౌడ్, బాలవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, కిరణ్, రమేశ్ కృష్ణ, బాబాఖాన్, హరిచంద్, యాదగిరి, పాండు నాయక్, వాణి, గఫార్, యాలాల మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ప్రసాద్‌కుమార్, తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్, జిల్లా అధ్యక్షుడు చౌడాపూర్ వెంకటేశ్, శ్రీనివాస్, రత్నం, వసంత్‌కుమార్, కృష్ణ, ప్రకాశ్, ప్రవీణ్, నర్సింగ్‌రావు, కిషన్, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కోట్‌పల్లి, బషీరాబాద్ మార్కెట్ కమిటీల చైర్మన్లు అంజయ్య, మాధవరెడ్డిలు, నాయకులు లొంకనర్సింహులు, మహిపాల్‌రెడ్డి, అజయ్‌ప్రసాద్, ఉత్తంచంద్ పాల్గొన్నారు.

మర్పల్లి: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదినం సందర్భంగా బుధవారంమోమిన్‌పేట్, మర్పల్లి మండలాలకు చెందిన 20 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులను మర్పల్లి మార్కెట్ కమిటీచైర్మన్ మహేందర్‌రెడ్డి అభినందించారు.

బంట్వారం: మండల కేంద్రంలో బుధవారం ఘనంగా తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నుర్సంపల్లి నర్సింహులు, యాదగిరి, శాకం నర్సింహులు, పి.వెంకటయ్య, ఆలంపల్లి శ్రీనివాస్, తౌఫిక్, అజీం పాల్గొన్నారు..

బషీరాబాద్: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదినం సందర్భంగా బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ బుధవారం వికారాబాద్‌లోని నివాసంలో ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


మర్పల్లి: కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయం వద్ద స్పీకర్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు


ధారూరు: ధారూరులో స్పీకర్ ప్రసాద్‌కుమార్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాన్‌సింగ్ తదితరులు


మర్పల్లి: మోమిన్‌పేట్ ప్రభుత్వాసుపత్రిలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదినం సందర్భంగా యువకుల రక్తదానం


మర్పల్లి: స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మర్పల్లి మండల కాంగ్రెస్ నాయకులు వినోద్‌స్వామి


మర్పల్లి: స్పీకర్‌కు కేక్ తినిపిస్తున్న మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు అశోక్


మర్పల్లి: స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రావుల్‌పల్లి గ్రామ అధ్యక్షుడు గొల్ల రవీందర్


మర్పల్లి: స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పార్టీ మండల నాయకులు రవీందర్, రఫీయోద్దీన్, ప్రభాకర్

ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు


అనంతపద్మనాభ స్వామి ఆలయంలో కుటుంబసభ్యులతో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పార్టీ నాయకులు

వికారాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మెతుకు ఆనంద్ కుటుంబ సమేతంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా మండలాల నుంచి వచ్చిన నాయకులు, పట్టణ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా మెతుకు ఆనంద్‌ను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు బీఆర్ఎస్ నేతలు మెతుకు ఆనంద్‌తో కలిసి ర్యాలీ నిర్వహించి గజమాలతో సత్కరించారు.

బంట్వారం: మండల కేంద్రంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆనంద్ జన్మదిన సందర్భంగా కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గంచెరువు మల్లేశం ఆధ్వర్యంలో ప్రభుత్వం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ధారూరు: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ జన్మదిన వేడుకలను బుధవారం ధారూరులో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భరోసా సెంటర్‌ను సందర్శించిన జార్ఖండ్ బృందం


మేడ్చల్ భరోసాసెంటర్ సందర్శనలో జార్ఖండ్ అధికారులు

మేడ్చల్ టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ భరోసా సెంటర్ సేవలను తెలుసుకోవడానికి జార్ఖండ్‌కు చెందిన అధికారుల బృందం బుధవారం సందర్శించింది. బృందంతో పాటు ఐఏఎస్ అధికారి కిరణ్ కుమారి పాసి, డైరెక్టర్ ఆఫ్ సోషియల్ వెల్ఫేర్ సంధ్యారాణి సందర్శించారు. ఈ కార్యక్రమంలో భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

అవుశాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన


బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజల్లో భక్తులు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అవుశాపూర్‌లో బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠ పూజ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనము, కలశస్థాపన, మంటప ఆరాధాన, అఖండ దీపారాధన, నాభిశిల అభిషేకము సాయంత్రం జలాధివాసం, బొడ్రాయి విగ్రహ ఊరేగింపు, మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు.

ప్రతీ రైతుకు గుర్తింపు కార్డు

పరిగి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతుకు గుర్తింపు కార్డు జారీ చేస్తామని రాపోల్ క్లస్టర్ ఏఈవో దివ్య అన్నారు. రాపోల్‌లో బుధవారం రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఫార్మర్‌ఐడీ పొందడానికి ఆధార్, భూయాజమాన్య పుస్తకానికి లింక్ చేసిన మొబైల్ నంబరుతో అధికారులను సంప్రదించాలని సూచించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్ రూరల్/దుద్యాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. టేకుల్‌కోడ్‌లో బుధవారం అధికారులు రెవెన్యూసదస్సు నిర్వహించి రైతుల భూ సంబంధిత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

దుద్యాల: ఈర్లపల్లిలో తహసీల్దార్ కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి 25 దరఖాస్తులు స్వీకరించారు. గురువారం దుద్యాల్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు, ఆర్ఐ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్: నందారం, కుప్పగిరి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన రెవెన్యూసదస్సుల్లో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గాయత్రి, డిప్యూటీ తహసీల్దార్ చాంద్‌పాష పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: కొలుకుందా, రావుల్ పల్లి గ్రామాల్లో ఆర్డీవో వాసుచంద్ర రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, ఆర్ఐలు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: గోనూరు, వీరశెట్టిపల్లి గ్రామాల్లో తహసీల్దార్ తారాసింగ్ రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూభారతిపై రైతులకు అవగాహన కల్పించారు. గోనూరులో నిర్వహించిన రైతు సదస్సులో 13 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీరశెట్టిపల్లిలో జరిగిన రైతు సదస్సులో ఎలాంటి దరఖాస్తులు అందలేదని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈ సదస్సుల్లో సీనియర్ అసిస్టెంట్లు ప్రదీప్, జూనియర్ అసిస్టెంట్ బాబు పాల్గొన్నారు.


శామీర్‌పేట్: అంతాయిపల్లిలో ఏడేళ్లుగా తీరని భూసమస్యపై అధికారులకు విన్నవిస్తున్న రైతు

యాలాల: మండల పరిధిలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో చెన్నారంలో మూడు, ఎన్కెపల్లిలో ఒకటి, నాగసముందర్‌లో రెండు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు.

బషీరాబాద్: ఇందర్‌చెడ్‌లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ షాహిదాబేగం దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో శివచరణ్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం పాల్గొన్నారు.

కులకచర్ల: పుట్టపహడ్‌లో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మనోహరచక్రవర్తి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐలు పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని సోమారంలో బుధవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. అసలత్వం లేకుండా రైతుల దరఖాస్తులను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: కొండాపూర్‌లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో 25 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో రికార్డుల సవరణ, తమ భూమి నిషేధిత జాబితాలో ఉన్నదని, మ్యూటేషన్ల కోసం ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయి.

ఘట్‌కేసర్ రూరల్: పోచారం మున్సిపాలిటీ, కొర్రెములలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు డీఎస్ రజిని పాల్గొని భూ బాధితులను ఆర్జీలను స్వీకరించారు. కొర్రెములలో 68 ఆర్జీలు స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అధిత్యా, అర్ఐ కావ్యారెడ్డి పాల్గొన్నారు.

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్ పరిధిలోని మందాయిపల్లిలో బుధవారం తహసీల్దార్ యాదగిరి రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. 17 మంది రైతులు వివిధ భూ సమస్యలపై రెవెన్యూ అధికారులకు ధరఖాస్తులను సమర్పించారు. ఈ సదస్సులో ఆర్ఐ రాఘవ, ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఏడు సంవత్సరాలుగా శామీర్‌పేట రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తన పని కావడం లేదని అంతాయిపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అంతాయిపల్లికి చెందిన 70 సంవత్సరాల వృద్ధ రైతు కొరివి అంజయ్య తన గోడు వెల్లబోసుకున్నాడు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నవాబుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మండలంలోని ఏక్‌మామిడి, మాదిరెడ్డిపల్లి, ఎల్లకొండ, మైతాప్‌ఖాన్ గూడ గ్రామాల్లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి రంగారెడ్డి, చిట్టెపు మల్లారెడ్డి, రావుగారి వెంకట్‌రెడ్డి, తలారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


నవాబుపేట: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో అర్హులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్, హౌజింగ్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, మాజీ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: తూంకుంటలోని మెగుళ్ళ వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బుధవారం తూంకుంట పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 44మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ జిల్లా హౌజింగ్ డీఈ అశోక్ కుమార్‌తో కలిసి ప్రొసీడింగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, మేనేజర్ శ్రవన్‌కుమార్, నాయకులు జైపాల్‌రెడ్డి, నర్సింహులు యాదవ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బాల్యవివాహం నిలిపివేత

కులకచర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాన్ని అధికారులు నిలిపివేశారు. కులకచర్లకు చెందిన మైనర్ బాలిక(16)తో దోమ మండలంలోని దాదాపూర్‌కు చెందిన యువకుడితో గురువారం పెళ్లి నిశ్చయించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ, పోలీసులు బుధవారం సాయంత్రం బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి పెళ్లి నిలిపివేశారు. అనంతరం బాలికను బాలసదానంకు తరలించారు.

తాండూరు వ్యవసాయశాఖ ఏడీగా రుద్రమూర్తి



తాండూరు రూరల్, జూన్ 4, (ఆంధ్రజ్యోతి): తాండూరు వ్యవసాయ శాఖ ఏడీగా రుద్రమూర్తి బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెలరోజులుగా రుద్రమూర్తి సెలవులపై వెళ్లడంతో ఆయన స్థానంలో తాండూరు వ్యవసాయ శాఖ ఏవో కొమరయ్యకు ఇన్‌చార్జీ ఏడీ గా బాధ్యతలు అప్పగించారు. అయితే ఏడీ రుద్రమూర్తి సెలవులు ముగించుకుని తిరిగివచ్చి బాధ్యతలు చేపట్టారు.

సంక్షిప్తంగా..

చెత్త సమస్యను పరిష్కరించాలి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలోని ఔటర్ టోల్‌గేట్ వద్ద పెద్దఎత్తున చెత్తను పారబోయడం వలన తీవ్రమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని వెంటనే చర్యలు చేపట్టి చెత్త సమస్యను పరిష్కరించాలని పాలకూర పోశెట్టి బుధవారం పోచారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు.

దర్గా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

తాండూరు: పాత తాండూరులోని హజ్రత్ సయ్యద్ నిజామోద్దీన్ షాహిద్ దర్గా ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాట్లు చేయాలని కోరుతూ బుధవారం దర్గా కమిటీ సభ్యులు మున్సిపల్ అధికారులు, పోలీసులకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు.

ముందస్తుగా ఉచిత రేషన్ పంపిణీ

బంట్వారం: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ముందస్తుగా మూడు నెలల ఉచితరేషన్‌ను ఒకేసారి పంపిణీ చేస్తోందని బీజేవైఎం వికారాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ ఏనుగుల శివకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

అందుబాటులో జనుము

తాండూరు రూరల్: 50శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తున్న జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కొమరయ్య తెలిపారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలి

తాండూరు: ఇంట్లో ఉన్న తడి, పొడి చెత్తను వేర్వేరుగా మున్సిపల్ వాహనాలకు అందజేయాలని మున్సిపల్ ఎనిర్వాల్‌మెంట్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్ గౌడ్ చెప్పారు. వంద రోజుల కార్యక్రమంలో బుధవారం మల్‌రెడ్డిపల్లిలోని అవగాహన కల్పించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కులకచర్ల: సాల్విడ్‌లో రైతు అంజిలయ్య (65) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కులకచర్ల సొసైటీ చైర్మన్ మొగులయ్య సహకారంతో డైరెక్టర్ కొండయ్య గౌడ్ గ్రామానికి వెళ్లి రూ.9వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

అనారోగ్యంతో మాజీ ఎమ్మెల్సీ మృతి

శామీర్‌పేట: అంతాయిపల్లికి చెందిన మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి శ్వాసకోశ సమస్యతో బాధపడుతూ బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఎమ్మెల్యే కోటాకింద ఎమ్మెల్సీగా మాగం రంగారెడ్డి ఎన్నికయ్యారు. ఆయన కొంత కాలంగా బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఆయన మృతిపట్ల ఎంపీ ఈటల రాజేందర్, బబీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్ సంతాపం తెలిపారు.

క్రైం కార్నర్

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని మృతదేహం పడి ఉందని వచ్చిన సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు 50నుంచి 55మధ్య వయస్సు ఉంటుందని పరిసరాలను పరిశీలించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు ప్రమాదవశాత్తు రైలులో నుంచి కిందపడి మృతిచెంది ఉండొచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఘట్‌కేసర్‌లో వృద్ధుడు..

ఘట్‌కేసర్ రూరల్ జూన్ 4(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ ఎదురుగా ఉన్న జిరాక్స్ సెంటర్ ఫుట్‌పాత్‌పై ఓ గుర్తుతెలియని (55 నుంచి60) వయస్సు గల వ్యక్తి మృతిచెంది ఉండగా సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించారు. అతడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. రోజూ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసేవాడని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దరాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయి కుమార్ తెలిపారు.

యువతి అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి అదృశ్యమైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం ఐటీకారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధి ఫకీర్‌టెక్యాకు చెందిన దీరావత్ శంకర్ కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు దీరావత్ దీపిక(19) ఇంటర్ పూర్తి చూసి ఇంట్లోనే ఉంటోంది. బుధవారం మధ్యాహ్నం ఇంటి సమీపంలోని కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు పరిసరాలను వెతికినా ఆచూకీ లభించలేదు. బంధువులను, మిత్రులను విచారించినా ఫలితం లేకపోవడంతో బుధవారం సాయంత్రం పోలీసులను ఆశ్రయిచారు. దీపిక వారం రోజుల నుంచి దీపిక అఖిల్ అనే వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతోందని తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయితో పట్టుబడిన వ్యక్తి రిమాండ్

పెద్దేముల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి సేవించే అలవాటు ఉన్న ఓవ్యక్తి ఇంట్లో గంజాయి కలిగిఉండడంతో అతడిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ ఘటన పెద్దేముల్ మండల తట్టెపల్లిలో జరిగింది. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తట్టెపల్లికి చెందిన మహ్మద్‌మియా(52) వద్ద గంజాయి ఉన్నట్లు తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు బుధవారం అతడి ఇంటి పరిసర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి 125గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈసోదాల్లో ఎస్ఐలు నిజాముద్దిన్, ఆదిశేషురెడ్డితో పాటు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కులకచర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను వెనక నుంచి మరో బైక్ ఢీకొట్టగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం తిరుమలాపూర్ గేటు సమీపంలో ముందుగా వెళ్తున్న బైక్‌ను గండి చెరువు తండాకు చెందిన తిరుపతయ్య తన బైక్‌తో ఢీకొట్టి అదుపుతప్పి పడిపోయాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో పరిగి ఆస్పత్రికి తరలించారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

పరిగి/కులకచర్ల/దుద్యాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రత్నం కోరారు. ఎన్‌రోల్‌మెంట్ ప్రచార జాత బుధవారం పరిగికి వచ్చింది. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ముత్యప్ప, వెంకటయ్య, మెగ్యా, మోహిజ్‌ఖాన్ పాల్గొన్నారు. అదేవిధంగా కులకచర్ల, దుద్యాలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు రత్నం, ముత్యప్ప, కృష్ణవేణి, సుశీలమ్మ, వెంకటేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు

కులకచర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రీధర్ అన్నారు. మండలంలోని చెరువు ముందలి తండా (కే) అటవీ భూముల్లో అదేతండాకు చెందిన కేతావత్ భాషా, ఆయన కుమారుడు నంద్యానాయక్‌లు ఇంటి నిర్మాణానికి గుంతలు తీశారు. బుధవారం ఫారెస్ట్ సెక్షన్ అధికారి శ్రీధర్ తవ్విన గుంతలు అటవీ భూములుగా గుర్తించారు. అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నారని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

వికారాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో దోస్త్‌ద్వారా రెండో విడత అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపల్ డాక్టర్ పీవీ. గీతాలక్ష్మీ పట్నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ(తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియం), బీకాం సీఏ (ఇంగ్లీష్ మీడియం, బీఎస్సీ(ఫిజికల్ సైన్స్ ఇంగ్లీష్, తెలుగు మీడియం), బీఎస్సీ(లైఫ్ సైన్స్ ఇంగ్లీష్ మీడియం కోర్సులు ఉన్నాయన్నారు. జూన్ 1 2025 నుంచి జూన్ 8 2025 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్ ప్రాంగణం, అనంతగిరి రోడ్డు వికారాబాద్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

దివ్యాంగుల భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్

పరిగి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పరిగిలో నిర్మించిన దివ్యాంగుల భవనాన్ని ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. పరిగిలో బుధవారంజరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిగిలో గత ప్రభుత్వ హయాంలో 2018లో దివ్యాంగుల సంక్షేమం, వారి అవసరాల కోసం భవనాన్ని నిర్మించిందని తెలిపారు. పరిగిలో భవనాన్ని ప్రారంభించేందుకు కలెక్టర్, ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు. దివ్యాంగుల పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు నెలకు రూ.6వేల పింఛన్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.సుధీర్, నాయకులు కె.ఈదయ్య, బాబు, లక్ష్మయ్య, చంద్రయ్య, నారాయణ, చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.